క్లుప్తంగా

డీఎస్సీ ఫలితాల్లో నకిరేకల్ వాసికి 32వ ర్యాంక్


పుట్ట శ్రీలత

నకిరేకల్ : పట్టణానికి చెందిన పుట్ట శ్రీలత డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీలో 77.47 మార్కులతో జిల్లా స్థాయిలో 32వ ర్యాంక్ సాధించింది. తన భర్త గుండు నాగరాజు కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో తనకు ఉద్యోగం వచ్చిందని శ్రీలత తెలిపారు.

నార్కట్‌పల్లి వాసికి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం

నార్కట్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో నార్కట్‌పల్లికి చెందిన గాదరి స్వప్న మొదటి ప్రయత్నంలోనే స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టులో ఉద్యోగం సాధించింది. ఈ మేరకు సోమవారం ఉద్యోగ నియామక పత్రం అందుకున్నట్లు స్వప్న తెలిపారు.

కట్టంగూర్ మండలంలో నలుగురు ..

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో కట్టంగూర్ మండలంలో నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అయిటిపాముల గ్రామానికి చెందిన తోటకూరి సైదులు స్కూల్ అసిస్టెంట్(సోషల్), మల్లారం గ్రామానికి చెందిన దండెంపెల్లి వెంకన్న స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్), అక్కలాయిగూడెంకు చెందిన గుండగోని రమాదేవి ఎస్‌జీటీ, రసూల్‌గూడెం గ్రామానికి చెందిన గోలి కృష్ణవేణి ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించారు.

సేవలు అందిస్తూ ప్రభుత్వ ఉద్యోగం

నకిరేకల్ : పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధి బ్రహ్మదేవర నరేష్ ఒకవైపు విధులు నిర్వహిస్తూ.. మరోవైపు స్వచ్ఛంద సేవ చేస్తూనే డీఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. బ్రహ్మదేవర నరేష్ ప్రస్తుతం కేతేపల్లి మండలంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. నరేష్ ఆరేళ్ల క్రితం లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్‌ను స్థాపించి పేదవారికి సహాయం చేస్తూ వస్తున్నారు. నేడు ఎస్జీటీ ఉద్యోగం సాధించడంతో పలువురు ప్రశంసిస్తున్నారు.

డీఎస్పీ ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

కనగల్: భక్తులపాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి-లావణ్య దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి స్వాగతం పలికారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

చండూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు అందజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, నరసింహ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభ

మర్రిగూడ: ఉపాధిహామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులకు సంబంధించి మంగళవారం మర్రిగూడ మండలంలోని దామెరభీమనపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ పనులు, పండ్ల తోటల పెంపకం, పశువుల పాకల నిర్మాణం తదితర పనులకు ఎస్టిమేషన్ రూపొందించి సభలో తీర్మానం చేసి ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చినమునయ్య, ఇన్‌చార్జ్ ఏపీఓ వివేక్‌సాగర్, టీఏ సత్యనారాయణ, ఎఫ్ఏ జహంగీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రితోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ నాయకులు మంగళవారం తహసీల్దార్ ఎం.నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కట్ట లింగస్వామి, యరసాని వంశీకృష్ణ, పగిళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని శివన్నగూడ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ బాలం నరసింహ కోరారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు ఎంఎస్పీ నిరసన

కనగల్: ఎస్సీ వర్గీకరణ చేయకుండా ప్రభుత్వం టీచర్ పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం నల్లగొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కందుల మోహన్ తెలిపారు. మంగళవారం కనగల్ మండలంలోని బొమ్మేపల్లిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.

అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- నేటికీ పూర్తికాని నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న చిట్యాల పట్టణ ప్రజలు, వ్యాపారులు


చిట్యాలలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం


తాత్కాలిక ప్రదేశంలో కూరగాయల దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు

చిట్యాల: పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత మార్కెట్)ను మంజూరు చేసింది. కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు ఒకేచోట జరిగేలా స్థలంతోపాటు నిధులను మంజూరు చేసింది. కానీ నిధుల కొరత కారణంగా ఏడాది కాలంగా నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

టైప్–3 ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మంజూరు..

చిట్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు చెందిన సర్వే నంబర్ 632 లోని రెండు ఎకరాల స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు కేటాయిస్తూ 2021 డిసెంబర్ 27వ తేదీన కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు టైప్–3 ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదించగా ప్రభుత్వం రెండు కోట్లకుపైగా నిధులను మంజూరు చేసింది. ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయలు, మాంసం, చేపల విక్రయ వ్యాపారుల అవసరాల అనుగుణంగా ప్రభుత్వం సూచించిన విధంగా అధికారులు డిజైన్ చేశారు. ప్రస్తుతం క్రయవిక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులకు ఈ అధునాతన మార్కెట్‌లో మొదటి ప్రాధాన్యతనిస్తూ క్లాంపెక్స్ భవనాలను కేటాయిస్తామని అధికారులు అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులతోపాటు, మాంసం విక్రయదారులకు అవసరమైన అన్ని రకాల వసతులను కల్పించనున్నారు. నీటి వసతి, మరుగుదొడ్లు, వాహనాలకు పార్కింగ్ వంటి వాటిని ఈ మార్కెట్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. మార్కెట్ సముదాయం నిర్మాణ పనులు ప్రారంభించిన ఆరు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు.

రెండేళ్లు దాటినా పూర్తి కాని పనులు..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులకు 31 మార్చి 2022లో అప్పటి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేశారు. 30 కూరగాయల దుకాణాలు, 14 మాంసం విక్రయ దుకాణాలు, 8 పండ్ల, పూల వ్యాపారులకు కేటాయించే విధంగా ఈ మార్కెట్ నిర్మాణ పనులను చేపట్టారు. కాగా నిర్మాణ పనులు ప్రారంభించిన ఆరు నెలల్లో పూర్తి కావాల్సి ఉండగా రెండతస్తుల స్లాబ్ వరకు మాత్రమే పూర్తయింది. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు ఇరవై లక్షల రూపాయల నిధులు మాత్రమే మంజూరుకాగా మిగిలిన నిధులు విడుదల కాలేదు. దీంతో పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు జరగడం లేదు. ఏడాది కాలంగా మార్కెట్‌లో ఎలాంటి నిర్మాణ పనులు జరగడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా మరిన్ని నిధులు మంజూరు చేస్తేనే మార్కెట్ నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. మరోవైపు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌తో దుకాణదారులతోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మాంసం, చేపలను భువనగిరి రోడ్డుకు ఇరువైపులా విక్రయిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేసి మార్కెట్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



చిట్యాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ఏడాది కాలంగా జరగడం లేదు. ప్రస్తుతం తాత్కాలికంగా నిర్వహిస్తున్న కూరగాయల దుకాణాలు ఇరుకుగా మారాయి. తగిన పార్కింగ్ లేదు. ఇతర ప్రాంతాల నుంచి భారీ వాహనాలు కూరగాయల లోడ్‌తో వచ్చినప్పుడు దిగుమతికి ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

– జిట్ట సరోజ, చిట్యాల

నిధుల కొరతతో జాప్యం జరుగుతోంది



చిట్యాల మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఇప్పటి వరకు రెండతస్తుల స్లాబ్ వరకు పూర్తయ్యింది. రెండు కోట్ల రూపాయల నిధుల అంచనాతో నిర్మాణ పనులను ప్రారంభించాం. వ్యయం పెరగడంతోపాటు నిధుల కొరతతో మార్కెట్ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేస్తాం.

– వీరేందర్, చిట్యాల మున్సిపల్ కమిషనర్

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి


మునుగోడు: అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీపీఓ మురళి

మునుగోడు: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి మురళి అధికారులకు సూచించారు. మంగళవారం మునుగోడు ఎంపీడీఓ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీలోపు ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనల ప్రకారం తేమశాతం ఉన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.2320 చెల్లించాలన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ పూజ, వ్యవసాయ అధికారి పద్మజ పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని నల్లగొండ మండల ప్రత్యేక అధికారి ఎండీ ఖాద్రి అన్నారు. మంగళవారం నల్లగొండ మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ మండలంలోని అప్పాజిపేట, చిన్న సూరారం, ఖాజీరామారం, కుదావన్‌పూర్, కొత్తపల్లి, మేళ్లదుప్పలపల్లి, నర్సింగ్‌బట్ల, పెద్దసూరారం, తొరగల్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏపీఎం వినోద, ఏపీఓ స్ఫూర్తిరెడ్డి, సీసీ గీతారెడ్డి పాల్గొన్నారు.

తిప్పర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని తిప్పర్తి మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి సూచించారు. మంగళవారం తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సన్నీ రాజు, ఏపీఎం శ్రీదేవి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చరిత అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి, ఐకేపీ ఏపీఎం జానకి, ఏపీఓ జంగమ్మ, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ

నకిరేకల్ : మర్రూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్, నకిరేకల్ కల్లు గీత సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ ఆవిష్కరించారు. పుట్ట జానయ్య, పుట్ట ముత్తిరాములు, దశరథ, రాములు, సైదులు, అర్జున్, వెంకన్న, తిరుమలేష్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నిమ్మనగోటి కృష్ణయ్య విగ్రహాన్ని కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు మంగళవారం ఆ గ్రామంలో ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ ఐతగోని నారాయణ, కుమ్మరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, ఆమంచి రామలింగం, కుమ్మరి లక్ష్మీనారాయణ, ఏడుకొండల వెంకటేశం, రాచకొండ కృష్ణయ్య, శ్యామ్‌కుమార్, ఏరుకొండ శ్రీనివాస్, నిమ్మలూరి శ్రీనివాస్, వీరయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు

నకిరేకల్ : పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో నకిరేకల్ మండలం నుంచి పలువురికి చోటు దక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కప్పల యాదయ్య, ముస్కు కవిత, లగిశెట్టి సత్యనారాయణ, కరీంలు నియమితులయ్యారు. రాష్ట్ర కమిటీలో చోటు దక్కినవారిని నకిరేకల్ మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు వంటల ఆనంద్‌బాబు, ప్రధాన కార్యదర్శి చిక్కుళ్ల సుధాకర్ అభినందించారు.

కనగల్ : మండలంలోని చిన్నమాదారం ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బుచ్చిరెడ్డి ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సైదులు

నల్లగొండ : పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సోమగాని సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సైదులు ఎన్నికయ్యారు. సైదులు ఉరుమడ్ల జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

చిట్యాల మండలం నుంచి..

చిట్యాల: పీఆర్‌టీయు టీఎస్ రాష్ట్ర 35వ కౌన్సిల్ సమావేశం మంగళవారం హైదరాబాదులో జరిగింది. ఈసమావేశంలో చిట్యాల మండలం నుంచి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా బాదం భిక్షపతి(ఎంపీపీఎస్ చిట్యాల), బచ్చు లుకేందర్‌రెడ్డి(జెడ్పీహెచ్ఎస్ పెద్ద కాపర్తి), దంతూరి సైదులుగౌడ్, పల్‌రెడ్డి యుగేందర్‌రెడ్డి, కందాల చంద్రారెడ్డి, సోమగాని సైదులు, పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వల్లం నాగరాజు, రాష్ట్ర కార్యదర్శులుగా అరెడ్ల వెంకట్‌రెడ్డి, ధారా గోవర్ధన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు కంచరకుంట్ల సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మీదేవిగా దుర్గామాత


నల్లగొండ : పూజలో పాల్గొన్న లక్ష్మీనగర్ కాలనీ భక్తులు


చిట్యాల: శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గామాత


నల్లగొండ: శ్రీనివాసనగర్ కాలనీలో దుర్గాదేవికి అభిషేకం చేస్తున్న భక్తులు


నల్లగొండ : వీటీ కాలనీలో అభిషేకం చేస్తున్న భక్తులు


కట్టంగూర్ : చెర్వుఅన్నారంలో ..


నార్కట్‌పల్లి : దసరా గుడి వద్ద..


నల్లగొండ పట్టణంలోని బోయవాడలో గంగపుత్ర సంఘం ఎదురుగా..


నల్లగొండ పట్టణంలోని రాక్ హిల్స్‌కాలనీలో హోమంలో పాల్గొన్న భక్తులు

తేరట్‌పల్లిలో ఇళ్ల స్థలాల పరిశీలన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

చండూరు : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో 30 ఏళ్ల క్రితం పేదలకు అందించేందుకు ఆనాడు ప్రభుత్వం 7 ఎకరాలకుపైగా భూమిని కొనుగోలు చేసింది. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారే కానీ ఇళ్ల స్థలాల హద్దులు చూపించలేదు. హద్దులు చూపించాలని కోరుతూ లబ్ధిదారులు ఇటీవల కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు ఇస్తూ వస్తున్నారు. దీంతో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. కొంతమంది భూమిని ఆక్రమించుకున్నారని, వెంటనే సర్వే చేసి రికార్డు మేరకు భూమి హద్దులు నిర్ణయించాలని తహసీల్దారు రాములుకు ఆర్డీఓ సూచించారు. సర్వే అనంతరం లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, హద్దులు చూపించనున్నట్లు తహసీల్దారు రాములు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న మాదగోని శ్రీనివాస్‌గౌడ్

కనగల్: బీజేపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం కనగల్ మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు పులకరం భిక్షం, ప్రధాన కార్యదర్శులు దాసరి వెంకన్న, బైరగోని అశోక్, జిల్లా అధికార ప్రతినిధి పిండి పాపిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పంతంగి సైదులు గౌడ్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి వట్టికోటి దుర్గ, మహిళా మోర్చా అధ్యక్షురాలు గోశెట్టి భద్రమ్మ, ప్రధాన కార్యదర్శి పాలకూరి సరిత, మండల కోశాధికారి నీలకంఠం వెంకన్న, సోషల్ మీడియా కన్వీనర్ పర్సనబోయిన ఈశ్వర భిక్షం పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ సంబరాలు


పానగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు


ప్రభుత్వ బాలుర ఐటీఐలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు


నల్లగొండలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

ముగిసిన నీటి సహాయకుల శిక్షణ


ప్రశంసాపత్రాలతో నీటి సహాయకులు

మర్రిగూడ : చింతపల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు రోజులుగా నీటి సహాయకులకు ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. మర్రిగూడ మండలంలోని 20 గ్రామపంచాయతీలకు చెందిన నీటి సహాయకులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. మొదటిరోజు చేతిపంపుల నిర్వహణ, రెండోరోజు సింగిల్‌ఫేజ్, థర్డ్ ఫేజ్ విద్యుత్‌లో నీటి నిర్వహణ, మూడో రోజు పైపులైన్ లీకేజీల మరమ్మతులు, నాలుగో రోజు నీటి నాణ్యతపై పరీక్ష కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు నీటి సహాయకులకు జిల్లా ఇన్‌స్ట్రా ఏఈ ఎం.శాంతాకుమారి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేతబడులను నమ్మొద్దు

కనగల్: మండల పరిధిలోని లింగాలగూడెంలో బాణామతి, చేతబడితో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పత్రికల్లో కథనాలు రావడంతో జన విజ్ఞాన వేదిక జిల్లా మాజీ అధ్యక్షుడు వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో మూఢనమ్మకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది అమాయక ప్రజలను ఎంచుకొని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో దగ్గుపాటి విమల, రాఫెల్, జంజరాల సైదులు, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు వెంట పిచ్చిమొక్కల తొలగింపు

మర్రిగూడ : మండలంలోని రాజాపేటతండా సమీపంలోగల చర్లగూడెంకు వెళ్లే దారిలో బీటీ రోడ్డు వెంట ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించడంతో మంగళవారం జేసీబీ సహాయంతో రవీందర్‌రావు పిచ్చిమొక్కలను తొలగింపజేయించారు. కార్యక్రమంలో భీమనగోని యాదయ్య, చెనగోని కృష్ణయ్య, లపంగి యాదయ్య, సిరపంగి జంగయ్య, వడ్డె వెంకటేష్, లపంగి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఘన స్వాగతం


ఎయిర్ పోర్టులో స్వాగతం పలుకుతున్న నాయకులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

నకిరేకల్ : లండన్ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో మంగళవారం నకిరేకల్ నియోజకవర్గ నేతలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి నకిరేకల్‌కు వచ్చిన వీరేశాన్ని నకిరేకల్ ఎంపీడీఓ చంద్రశేఖర్, డీఆర్‌డీఏ డీపీఎం మోహన్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.